కార్తీక దీపోత్సవం

■ కోనేరుకు కొత్త శోభ



పుంగనూరు కోనేరులో సోమవారం సాయంత్రం శివనామ స్మరణ నడుమ అత్యంత వైభవంగా కార్తీక దీపోత్సవం జరిగింది. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో పుంగనూరుతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి కోనేరు వద్ద దీపారాధనకు హాజరయ్యారు. శివపార్వతులకు అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయం నుంచి అఖండ దీపాలతో కోనేరు వద్దకు వచ్చారు. కార్తీక మాస విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులు వెలిగించిన దీపాలతో కోనేరు వినూత్న శోభ సంతరించుకుంది.హిందూ జాగరణ సమితి ప్రతినిధులు పరమేశ్, త్రిమూర్తిరెడ్డి, విశ్రాంత డీఎస్పీ సుకుమార్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- పుంగనూరు, ఆంధ్రజ్యోతి

రామకుప్పం శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించు కుని భక్తులు దీపాలు వెలిగించారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద, వెనుకన గల త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశీ వనాలు ఈ దీపాల వెలుగులతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి

■ సోమవారోత్సవం



వనాల్లో కార్తీక దీపాల వెలుగులు



అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి



రాశీవనంలో పార్వతీ పరమేశ్వరుల ముందు కార్తీక దీపాలు

కుప్పానికి కుంకీలు

● నడిమూరు

అటవీ నర్సరీలో క్యాంప్

కుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్ సుదీర్ఘకాలం తర్వాత సొంత అడవికి చేరుకున్నాయి. కుప్పం మండలం నడిమూరు అటవీ శాఖ నర్సరీలో క్యాంప్ చేశాయి. ఇటీవల కుప్పం మండలంలో ఒంటరి ఏనుగు దాడిలో ఒక రైతు మృతి చెందడంతో పాటు ప్రజలను హెచ్చరించారు. ఇంకోపక్క కుప్పం అటవీ ప్రాంతంలో అదనంగా 5 ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీ సిబ్బందితోపాటు స్థానిక ప్రజలు చెబుతున్నారు. దీంతో కుప్పం నియోజకవర్గ అటవీ సమీప గ్రామాలు ఏనుగుల దాడుల భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాయి.ఈ నేపథ్యం లోనే పలమనేరు శిక్షణ కేంద్రంలో ఉన్న కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్ లను అధికారులు సోమవారం నడిమూరులోని అటవీ శాఖ నర్సరీలోకి తరలించారు. సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో జయశంకర్, డీఆర్వో సమీర్ బాషా తదితరులు వాటిని దగ్గరుండి ఇక్కడకు తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా అటవీ శాఖాధికారులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఒంటరి ఏనుగు సంచారం నేపథ్యంలో నడిమూరు క్యాంపునకు కుంకీ ఏనుగులను తరలించినట్లు చెప్పారు. ఇకమీదట కుంకీ ఏనుగుల ద్వారా ఒంటరి ఏనుగుతోపాటు, రామకుప్పం మండలం ననియాల పరిధిలో సంచరిస్తున్న ఏనుగులను కూడా తరిమేస్తామన్నారు. ప్రస్తుతానికైతే కుంకీ ఏనుగును కుప్పం అటవీ ప్రాంతంనుంచి తమిళనాడు అటవీ సరిహద్దు ప్రాంతమైన కుంగుర్తికి మళ్లించామన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, అయితే ఏనుగుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్ సూచించారు.



నడిమూరు నర్సరీలో వినాయక్



కుంకీ ఏనుగుతో సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, ఎఫ్ఆర్వో జయశంకర్ తదితరులు

రామకుప్పం మండలంలో రెండు ఏనుగుల సంచరిస్తున్న నేపథ్యంలో కుంకీ ఏనుగులను పలమనేరు శిక్షణ కేంద్రం నుంచి సోమవారం వాటి సొంత గూడు అయిన కుప్పం తీసుకువచ్చేశారు.

కుప్పం మండలం ఉర్లఓబనపల్లె పంచాయతీ కూర్మానపల్లెలో ఈనెల 12వ తేదీ రాత్రి కిట్టప్ప (70) అనే రైతు ఒంటరి ఏనుగు దాడిలో మృతి చెందాడు. మరోవైపు రామకుప్పం మండలం ననియాల అటవీ ప్రాంతంలో రెండు ఏనుగుల సంచారం రెండు మూడు రోజులుగా మొదలైంది.ఆదివారం రాత్రి ఈ ఏనుగులు వరి పొలాల్లోకి చొరబడి తీవ్రంగా పంట నష్టం కలిగించాయి. అదేరోజు రాత్రి నడిమూరు ప్రాంత అడవుల్లోకి చొరబడే అవకాశం ఉండడంతో అటవీ శాఖాధికారులు సమీప గ్రామాల్లో దండోరా వేయించారు.ఏనుగులు సంచరిస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలని

జంట ఏనుగుల స్వైరవిహారం

రామకుప్పం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):రామకుప్పం మండలంలోని నారాయణపురంతండా, ననియాలతండాల సమీప పొలాలపై జంట ఏనుగులు ఆదివారం రాత్రి స్వైరవిహారం చేశాయి. పలువురు రైతులకు చెందిన వరి, రాగి, పశుగ్రాసం పంటలను తిన్నంతగా తిని పాక్షికంగా ధ్వంసం చేశాయి. మరో రైతుకు చెందిన ఏడు కొబ్బరి చెట్లను కూడా ధ్వంసం చేశాయి. వారం రోజులుగా ఏనుగుల కదలికలపై అటవీ అధికారులు, ట్రాకర్లు నిఘా ఉంచి, అవి పొలాల వైపు రాకుండా చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. .ఈ పరిస్థితుల్లో రైతులెవరూ రాత్రిళ్ళు పొలాల వద్దకు వెళ్ళరాదని అటవీ అధికారులు సూచించారు. ఏనుగులు పొలాల వైపు వచ్చినపుడు తరిమే ప్రయత్నం చేయరాదని తెలిపారు.



ధ్వంసమైన వరి పంట



గజరాజుల సంచారం

అసెంబ్లీ కమిటీ సమావేశం వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో డీసీసీబీలో చోటుచేసుకున్న అవినీతి,అక్రమాలపై అమరావతిలో సోమవారం జరగాల్సిన అసెంబ్లీ కమిటీ సమావేశం చివరి క్షణంలో రద్దయింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధ్యక్షతన జరగాల్సిన ఈ విచారణకు సమగ్ర వివరాలతో హాజరుకావాలని పది రోజుల క్రితమే అసెంబ్లీ కమిటీ అధికారులు డీసీసీబీ సీఈవో శంకర్‌బాబుకు సమాచారమిచ్చారు. ఆదివారం రాత్రి కమిటీ సమావేశం వాయిదా పడిందని,విచారణ జరిగే తదుపరి తేదీ గురించి ఇంకా సమాచారం అందలేదని బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి.

పాఠశాలల్లోనే ఆధార్ అప్‌డేట్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉచితంగా ఆధార్ అప్‌డేట్‌కు ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించింది. ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు పాఠశాలల్లోనే ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక శిబిరాలు కొనసాగేలా ఆదేశాలు ఇచ్చింది. జిల్లాలో గత నెల 8 రోజుల పాటు అప్‌డేషన్ చేపట్టగా 25వేల మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఇంకా 30వేల మంది చేసుకోవాల్సి ఉంది. ఈ నెల 17 నుంచి 26 వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థులు 123 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కో- ఆర్డినేటర్ రవికుమార్ తెలిపారు. 15 నుంచి 17 ఏళ్ల యువకులు వారి సమీప జూనియర్ కాలేజీల్లో ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

రైతుల ఖాతాల్లో రేపు నిధుల జమ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు బుధవారం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సంయుక్త వాటా కింద ఏటా రైతుల ఖాతాల్లో రూ.20 వేలు జమవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే తొలి విడతగా ఒక్కో రైతు ఖాతాలో రూ.7వేలు జమకాగా, ఈ ఏడాది రెండవ విడతగా బుధవారం మరో రూ.7 వేలు జమకానుంది.అందులో భాగంగా అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెండో విడతగా ఒక్కో రైతుకు రూ.5 వేల చొప్పున జిల్లాలోని 2,05,753 మంది రైతుల ఖాతాల్లో రూ.102.88 కోట్లు జమకానుండగా, పీఎం కిసాన్ కింద 21వ విడతగా ఒక్కో రైతు ఖాతాలో రూ.2వేలు చొప్పున 1,67,900 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.33.58 కోట్లు జమకానుంది. కాగా మొత్తంగా 3,73,653 మంది రైతుల ఖాతాల్లో రూ.136.46 కోట్లు జమకానుంది.

27మంది సచివాలయ సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలకు కలెక్టర్ ఆదేశాలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముందస్తు అనుమతి లేకుండా అనధికారికంగా సెలవులో వెళ్లిన 27మంది సచివాలయ సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం 612 సచివాలయాల అటెండెన్స్‌ను పరిశీలించిన కలెక్టర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయ సిబ్బంది, వారికి కేటాయించిన సచివాలయాల్లోనే విధులు నిర్వర్తించాల్సి వుండగా పై అధికారి నుంచి అనుమతి లేకుండా సెలవులో వెళ్లడం సరికాదని, వీరిపై తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మెడికల్ గ్రౌండ్స్ కింద నెలకు మించి సెలవులో వెళ్లిన 152 మందిని మెడికల్‌బోర్డుకు పంపించి పరీక్షలు నిర్వహించి తగు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ఇకనైనా సెలవులో వెళ్లిన సిబ్బంది వెంటనే విధుల్లో చేరేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేపు కుప్పానికి సీఎం సతీమణి

● 3 రోజులపాటు భువనేశ్వరి పర్యటన ● డీకేపల్లె చెరువులో జలహారతి
● 4 మండలాల్లో విస్తృత కార్యక్రమాలు



డీకేపల్లె చెరువులో భువనేశ్వరి జలహారతి ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 19, 20, 21 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. టీడీపీ వర్గాల సమాచారం మేరకు భువనేశ్వరి 19వ తేదీన కుప్పం వస్తారు.కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.మహిళలతో ముఖాముఖి సమావేశమవుతారు. నిండి మొరవ పారడానికి సిద్ధమైన డీకేపల్లె చెరువులో కృష్ణా జలాలకు హారతి ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో డీకేపల్లె చెరువును సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రెస్కో ఛైర్మన్ వీజీ.ప్రతాప్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తదితరులు సందర్శించారు. జలహారతికోసం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, అప్పు ముఖేశ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దేవతలారా రారండి

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వేడుకగా ధ్వజారోహణం

తిరుచానూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సకల దేవతలు అతిథులుగా వచ్చారు. భక్తులు ఆనందపరవశం కాగా ధ్వజపటం పైకి ఎగిరింది. బ్రహ్మాండనాయకుడి ప్రియదేవికి పద్మావతి బ్రహ్మోత్సవం మొదలైంది. తిరుచానూరు అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యేందుకు సోమవారం ఉదయం ధ్వజస్తంభం ఎదుట పూజలు చేశారు. సకలదేవతామూర్తులను పండితులు ఆహ్వానించి దిగ్బంధనం చేశారు. ఉదయం 6 గంటలకు చక్రత్తాళ్వార్ ముందుకు సాగగా వెనకే అమ్మవారికి అభిముఖంగా గజచిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి అంకురార్పణ సందర్భంగా యాగశాలలోని కలశాల్లో నింపిన నవధాన్యాలు అంకురించాయి. వీటిని తీసుకొచ్చి ధ్వజస్తంభం ముందు ఉంచి పూజలు చేశారు. 9.30 గంటలకు ధనుర్లగ్నంలో వేడుకగా ధ్వజారోహణం చేశారు. కంకణభట్టారు వేంపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ క్రతువు జరిగింది. మాడవీధుల్లో భక్తులందరూ అమ్మవారి వాహన సేవ తిలకించేలా ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు.కాగా రాష్ట్రప్రభుత్వం తరపున సోమవారం సాయంత్రం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ఆలయాల్లో భక్తుల రాక గణనీయంగా పెరిగిందన్నారు.



గజ పటాన్ని ధ్వజస్తంభంపైకి ఆరోహణం చేస్తున్న అర్చకులు



చిన్నశేషుడిపై అమ్మ చిద్విలాసం

తొలిరోజైన సోమవారం రాత్రి 7 గంటలకు అమ్మవారు పరమ వాసుదేవుడు అలంకారంలో చిన్నశేష వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవ ముందు కళాబృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. కాగా, మధ్యాహ్నం 12.30 గంటలకు అమ్మవారికి శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో స్నపన తిరుమంజనం.. ఆస్థాన మండపంలో సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.




శుక్రవారపుతోటలో

ఫలపుష్ప సోయగం






పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుచానూరులోని అమ్మవారి శుక్రారపుతోటలో టీటీడీ ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శన భక్తులకు కనువిందు చేస్తోంది. ధ్వజారోహణం అనంతరం ఈ ప్రదర్శనను ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ప్రారంభించారు. వివిధ పురాణ ఘట్టాలపై ఏర్పాటు చేసి మూర్తులు విశేష ఆకర్షణగా మారాయి. నరకాసురుని సంహరిస్తున్న సత్యభామ, పాలకడలిలోని మహావిష్ణువును కాలితో తన్నుతున్న భృగుమహర్షి, వామన అవతారంలో బలి చక్రవర్తిని పాతాళ లోకానికి పాదంతో తొక్కుతున్న దృశ్యం, తాటకిని సంహరిస్తున్న శ్రీరాముడు, శ్రీపద్మావతి, శ్రీనివాసుల కల్యాణ వైభోగం, అష్టలక్ష్మీవైభవం.. వంటివి సెట్టింగ్స్ వేసి కళ్లముందు సాక్షాత్కరించేలా చేశారు. గజేంద్రమోక్షం సైకిత శిల్పం ఏర్పాటు చేశారు. అదే విధంగా కూరగాయల రూపొందించిన దేవతామూర్తుల మండపం ఆకర్షణీయంగా ఉంది. చామంతి, రోజా, పెట్రోనియా, బిగోనియా, సాల్వియా వంటి పూలతో రూపొందించిన ఏనుగు, కలశం, సీతాకోకచిలుక, డాల్ఫిన్‌లు ఆకట్టుకుంటున్నాయి. 25 వేల సీజనల్ ఫ్లవర్స్, కట్ ఫ్లవర్స్ వినియోగిస్తున్నారు. ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో ఫల, పుష్పప్రదర్శనశాలను తీర్చిదిద్దారు. అదే విధంగా ఎస్వీ ఆయుర్వేదం వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం, వన మూలికల ప్రదర్శన,పుస్తక ప్రదర్శనలను కూడా ఈవో ప్రారంభించారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

మిట్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు డాక్టరేట్



మారుతీ ప్రసాద్

కురబలకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీకి చెందిన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, అధ్యాపకుడు మారుతీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారని వీసీ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మారుతీప్రసాద్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో 'యాన్ ఇంటలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐవోటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మిట్స్ యూనివర్శిటీ చాన్సలర్ ఎన్.విజయభాస్కర చౌదరి, ప్రో చాన్సలర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి తదితరులు అభినందించారు.

తిరుమలలో ప్రముఖుల సందడి

తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్వీ రవీంద్రన్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ వీనోద్ కుమార్, ఇన్ఫోసిస్ సంస్థ చైర్‌పర్సన్ సుధా నారాయణమూర్తి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజజేంద్రప్రసాద్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, ఎన్టీఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పీ చంద్రశేఖర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ ఆర్వీ రవీంద్రన్, జస్టిస్ టీ వినోద్‌కుమార్, సుధా నారాయణమూర్తి

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.98 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,004
తలనీలాలు సమర్పించినవారు: 23,900

తిరుమలలో 'ప్రేమంటే' హీరో, హీరోయిన్‌లు



తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): 'ప్రేమంటే' సినిమా బృందం సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. హీరో ప్రియదర్శి, హీరోయిన్ ఆనంది, ఆ చిత్ర నిర్మాత పుష్కర్ రామ్మోహన్‌రావుతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 21న తమ చిత్రం విడుదల కానున్న సందర్భంగా స్వామిని దర్శించుకుని విజయం ప్రసాదించమని కోరుకున్నామన్నారు.

తిరుమలలో పెజవర మఠాధిపతి



ఉడిపిలోని పెజవర మఠాధిపతి విశ్వేషప్రసన్న తీర్థస్వామిజీ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్న మఠాధిపతికి ఆలయ పేష్కార్ రామకృష్ణ, పోటు పేష్కార్ మునిరత్నం, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అర్చక బృందంతో కలిసి ఇస్తికఫాల్(ఆలయ మర్యాదలు)తో స్వాగతం పలికారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకరిస్తా: చిత్తూరు ఎంపీ



తిరుపతి/తిరుపతి(జీవకోన), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకరిస్తానని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం చిత్తూరులో ఆయన్ను కలిసి సాధన సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ని కూడా కలిసి సాధన సమితి నేతలు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, తిరుపతి ఫిలిం సొసైటీ ఛైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సాధన సమితి నాయకులు వైయస్ బాబు, బుజ్జి బాబు నాయుడు, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల వికేంద్రీకరణతో అభివృద్ధి

● వైజాగ్ సీఐఐ సమ్మిట్ సక్సెస్ వెనుక బాబు, లోకేశ్ కృషి



మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

తిరుపతి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు తీసుకొచ్చి, అభివృద్ధి వికేంద్రీకరణకు సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ కృషిచేస్తున్నారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, ఎమ్మెల్యేలు సునీల్ (గూడూరు), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. వైజాగ్‌లో జరిగిన సీఐఐ సమ్మిట్ విజయవంతమైన సందర్భంగా గురువారం వీరు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. సీఐఐ సదస్సు దేశాన్ని ఆకర్షించిందని, రూ13లక్షల కోట్లు పెట్టుబడులు, 16లక్షల ఉద్యోగాలు సీఐఐ సదస్సు అందించిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదన్నర లోపే డబుల్ ఇంజిన్ సర్కార్ కావడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్నవాటిని తరిమికొట్టారని మండిపడ్డారు. నాయకత్వంపై నమ్మకం ఉండడం వలనే పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వడమే కాకుండా 21 రోజుల్లో సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నారన్నారు. టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ మృతిపై వైసీపీ నాయకులు దొంగేదొంగ అన్నట్టుగా ఉందన్నారు. వైఎస్ వివేకా, పరిటాల రవి హత్యకేసులో సాక్షులు చనిపోయినట్టుగా పరకామణి చోరీ కేసులో ఆధారాలను వైసీపీ నేతలు చెరపేస్తున్నారని ఆరోపించారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.




మంచు తెరలను చీల్చుకుని బయటికి వస్తున్న భానుడు....నీటిలోపలున్న చేపలు పైకి వచ్చి సలసలమని పరిగెడుతున్న ధ్వనులు... ఆ చేపలను పట్టుకోవడానికి కొంగల ప్రయత్నాలు.... చిత్తూరు గంగినేని చెరువు కట్ట పై సోమవారం ఉదయం వాకింగ్ చేస్తున్న వారికి ఆహ్లాదాన్ని మిగిల్చిన దృశ్యాలివి.

దీర్ఘకాలిక విద్యుత్తు సమస్యలను నా దృష్టికి తీసుకురండి

● 'డయల్ యువర్ సీఎండీ'లో వినియోగదారులకు శివశంకర్ సూచన



విద్యుత్ వినియోగదారుల సమస్యలను వింటున్న సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు17(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్తు వినియోగదారులు చిన్నవాటితో పాటు పెద్దసమస్యలను తన దృష్టికి తీసుకొస్తే త్వరితగతన పరిష్కరించే అవకాశం ఉంటుందని సీఎండీ శివశంకర్ తెలిపారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ పరిధిలోని జిల్లాల నుంచి 67 మంది ఫిర్యాదులు చేసినట్లు ఆయన తెలిపారు. కరెంటు సర్వీసులు మంజూరు చేయాలని, కాలిపోయిన, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన మార్చాలని, విద్యుత్ లైన్ల మార్పు, లోఓల్టేజ్ సమస్య, సరఫరాలో అంతరాయాలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిపై అధ్యయనం చేసి 15 రోజుల్లో పరిష్కరించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన సమస్యల్లో, సాంకేతిక పరమైనవి మినహా మిగిలిన వాటిని పరిష్కరించామన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, సీజీఎం జె.రమణాదేవి, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకట రాజు, విజయన్ పాల్గొన్నారు.

శ్రీసిటీ పరిశ్రమల వితరణతో విద్యా వసతులు

● రూ.58 లక్షలతో సత్యవేడులో కళాశాల హాస్టల్, వానెల్లూరులో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం



సత్యవేడులో హాస్టల్ భవనం ప్రారంభించాక శ్రీసిటీ, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రతినిధులు

సత్యవేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, వీఆర్‌వీ పరిశ్రమలు కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా రూ.58 లక్షలతో నిర్మించిన నూతన విద్యా వసతులను ఆయా సంస్థల ప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. సత్యవేడులో రూ.46 లక్షలు వెచ్చించి 3 విశాల గదులతో నిర్మించిన బీసీ బాలుర కళాశాల హాస్టల్ భవనాన్ని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా పరిశ్రమ ఎండీ హాజీమే కజోకా, శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి సోమవారం ఉదయం ప్రారంభించారు. సంస్థ డీజీఎం వెంకటేష్, సీఎస్ఆర్ కమిటీ సభ్యులు మల్లీశ్వరన్, పృథ్వీ, మహేష్ ప్రసాద్, శ్రీకాళహస్తి డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మునీంద్ర, వార్డెన్లు రామయ్య, గంగాధరం పాల్గొన్నారు.

● శ్రీసిటీలోని చార్ట్-వీఆర్‌వీ పరిశ్రమ రూ.12 లక్షలతో సత్యవేడు మండలం వా నెల్లూరులో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనం, వంట గదులను వీఆర్‌వీ సంస్థ డైరెక్టర్(హెచ్ఆర్) యామిని సిన్హా, తయారీ విభాగం హెడ్ ప్రసంజిత్ ప్రారంభించారు. ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, వీఆర్‌వీ సంస్థల సీఎస్ఆర్ చర్యలను శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్)నిరీషా సన్నారెడ్డిఅభినందించారు. మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

కోర్టులో లొంగిపోయిన మాజీ సీఈవో జగదీశ్

భాకరాపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు సహకార సంఘంలో రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడిన మాజీ సీఈవో జగదీశ్ సోమవారం పీలేరులోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. కోర్టు అతడికి 14 రోజుల రిమాండు విధించిందన్నారు. సహకార సంఘంలో వన్ గ్రాము గోల్డు ఆభరణాలు తాకట్టు పెట్టి 2022 నుంచి 2025 వరకు రూ.72 లక్షల మేరకు సీఈవో ద్వారా కె.రెడ్డమ్మ, సి.రుతున్‌కు రుణాలు మంజూరు చేశారు. ఈ నెల 4న డీసీసీ బ్యాంకు మేనేజరు పరిశీలనలో ఈ విషయాన్ని గుర్తించారు. బాధ్యులైన సీఈవో, అప్రైజరు, అప్పటి పాలకవర్గం, పర్సన్ ఇన్‌చార్జ్‌పై చర్యలు తీసుకోవాలన్న సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్ ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. రెండు రోజుల క్రితమే అధికారులు జగదీశ్‌ను సస్పెండ్ చేశారు. కేసు నమోదు చేశాక పరారీలో ఉన్న జగదీశ్ సోమవారం కోర్టులో లొంగిపోయాడు.

ఫిర్యాదుదారులను తిప్పించుకోవద్దు

● అధికారులకు కలెక్టర్ ఆదేశం ● పీజీఆర్ఎస్‌కు 313 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి. పరిష్కారం కానివాటికి ఆయా ఫిర్యాదుదారులకు నివేదిక పంపండి. అంతేకానీ ఫిర్యాదుదారులను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దు' అంటూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు పలు సమస్యలపై 313 అర్జీలు అందాయి. అందులో భూసమస్యలపై ఒక రెవెన్యూశాఖకే 199అర్జీలు రావడం గమనార్హం. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు.

పింఛను ఇప్పించండి



నా అనే వారు నాకెవరూ లేరు. వృద్ధాప్యం కారణంగా నడవలేని పరిస్థితి. కంటిచూపు మందగించింది. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- అచ్చయ్య, బావాజీ కాలనీ, సూళ్లూరుపేట

మమ్మల్ని ఆదుకోండి



ఓళ్లూరు రాయలచెరువు కట్ట తెగి వరద ప్రవాహానికి ఇళ్లు, పొలాలు దెబ్బతిన్నాయి. మాకు జీవనాధారమైన వ్యవసాయ భూములపై ఇసుక మేట వేసింది. దీంతో తీవ్రంగా నష్టపోయాం. మమ్మల్ని ఆర్థికంగా ఆదుకుని వ్యవసాయం చేసుకోవడానికి వీలుగా పొలాలను బాగుచేసుకునేందుకు సహకరించండి.

- కళత్తూరు, పాతపాళెం రైతులు, కేవీబీపురం మండలం

మా పొలంలో హెచ్చరిక బోర్డు ఎత్తివేయండి

'మాది కేవీబీపురం మండలం పీవీకండ్రిగ గ్రామం. నా పేరు లోకేష్. మా తాత గురవయ్యకున్న 7.8 ఎకరాల వ్యవసాయ భూమిని మా పెద్దనాన్న, మేము ఉమ్మడిగా సాగు చేసుకునేవాళ్లం. ఐదేళ్ల క్రితం పెద్దమనుషుల సమక్షంలో చెరిసగం పంచుకున్నాం. మాకు వచ్చిన భాగం వ్యవసాయ భూమిలో సాగు చేయనివ్వకుండా మా పెద్దనాన్న వీరాస్వామి, అయన కుమారుడు ప్రేమ్‌కుమార్ దౌర్జన్యం చేస్తున్నారు. అధికారులను తప్పుదారిపట్టించడంతో మాపొలంలో రెవెన్యూ వారు హెచ్చరిక బోర్డు పెట్టారు. క్షేత్రస్థాయిలో విచారించి మా భూమిలో బోర్డు తొలగించండి. తిరిగి మేము పంటలు సాగు చేసుకోవడానికి సహకరించండి' అంటూ కుటుంబంతో కలిసి ఆయన కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. కలెక్టర్‌కు అర్జీ అందజేయగా పరిశీలిస్తామన్నారు. ఇదే భూవివాదంపై రెండు వారాల క్రితం వీరిపై వీరాస్వామి కుటుంబం వీరిపై ఆరోపణలు చేస్తూ కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ క్యాన్ తీసుకుని తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యకు చేసుకుంటామని బెదిరించిన సంగతి తెలిసిందే.

12గంటల పనివిధానాన్ని రద్దు చేయండి



మన రాష్ట్రంలో పని గంటలను 12 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ నేత విజయకుమార్, అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు గంగాదేవి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ముగ్గురిని తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన పి.మల్లికార్జున అలియాస్ బాలు, ఉల్లి గుణశేఖర్ స్నేహితులు. జులాయిగా తిరిగేవారు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన రోహిణి అలియాస్ శ్రీదేవితో వీరికి పరిచయమైంది. ఈమె సహకారంతో ఈనెల 9న తిరుపతికి చెందిన ఓ బాలికను అపహరించి ఆ ఇద్దరు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు బాలిక ఆచూకీ తెలుసుకుని తల్లితండ్రులకు అప్పగించారు. నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 274 అర్జీలు

చిత్తూరు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 274 మంది అర్జీదారులు హాజరై సమస్యలతోకూడిన వినతిపత్రాలను ఇచ్చారు. ఇందులో రెవెన్యూ, సర్వేశాఖకు 189, పోలీసుశాఖకు 12, డీఆర్డీఏకు 32, పంచాయతీరాజ్‌కు 4, పశు సంవర్ధకశాఖకు 7, విద్యాశాఖకు 3 పోనూ అటవీశాఖ, రిజిస్ట్రేషన్, మైన్స్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, వ్యవసాయ, ఇరిగేషన్, ఎస్ఎస్ఏ శాఖలకు 27 అర్జీలు అందాయి. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్ అర్జీలను తీసుకున్నారు. వారి సమస్యలను విని నిర్ణీత సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర అధికారులు వినతిపత్రాలను తీసుకున్నారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో బాధితుల నుంచి ఎస్పీ తుషార్ డూడీ వినతిపత్రాలను తీసుకున్నారు. వారి సమస్యలను విన్న ఆయన పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల్లో కొన్ని...



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

విద్యుత్‌లైన్ వేలాడుతోంది

తన పొలానికి వచ్చే విద్యుత్‌లైన్ కిందకు వేలాడుతున్నందున వర్షాలు వచ్చినప్పుడల్లా సరఫరాను నిలిపేస్తున్నారని ఎస్ఆర్‌పురం మండలం ఈకేకండ్రిగ పంచాయతీలోని పబ్బంచేను ఎస్టీకాలనీకి చెందిన ఈశ్వరి ఫిర్యాదుచేశారు. కిందకు వేలాడుతున్న విద్యుత్‌లైన్‌ను బాగు చేసి సరఫరా చేయాలని కోరారు.

దారి సౌకర్యాన్ని కల్పించండి

తమ పొలాలకు వెళ్లేదారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని బైరెడ్డిపల్లె మండలం గౌనితిమ్మేపల్లెకు చెందిన ఎస్సీ, ఎస్టీ రైతులు కోరారు. కడపనత్తం నుంచి పేర్నంబట్టుకు వెళ్లే మెయిన్‌రోడ్డుకు ఉత్తరం వైపున 60 మంది రైతులకు సంబంధించి 125 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. పూర్వీకుల కాలం నుంచి సాగు చేసుకుంటున్న ఈ భూముల వద్దకు వెళ్లడానికి బండిబాట ఉండేదని చెప్పారు. ఈ బండిబాటను గ్రామానికి చెందిన కొంత మంది ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశారన్నారు.

ఇళ్ల స్థలాలను కేటాయించండి

పక్కా గృహ నిర్మాణాల కోసం ఇంటి స్థలాలను కేటాయించాలని సదుం మండలం బూరగమందకు చెందిన ఎస్టీ మహిళలు కోరారు. గ్రామంలో 20 కుటుంబాల వరకు పూరి గుడిసెల్లో ఉంటున్నామన్నారు. వర్షాలు వస్తే కూలిపోతాయోనన్న భయంతో కాలం వెళ్లదీస్తున్నామన్నారు. పక్కాగృహ నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించి నిర్మాణాలు చేసుకోవడానికి ఆర్థికసాయం చేయాలని కోరారు.

శ్మశానవాటికలో సదుపాయాలు కల్పించండి

చిత్తూరు శివారుప్రాంతాలైన జానకారపల్లె, అంబేడ్కర్‌నగర్, శంకరయ్యగుంట, ఎంజీఆర్ వీధి, లెనిన్‌నగర్ కాలనీలకు సంబంధించి బాలాజీనగర్‌కాలనీలో ఉన్న శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జానకారపల్లె గ్రామస్తులు కోరారు. శ్మశానాన్ని ఆనుకుని మురుగుకాల్వ పోతుందని, కాలువమధ్యలో పెద్ద గుండు ఉండటం చేత మురుగునీరంతా శ్మశానవాటికలోకి వచ్చేస్తోందన్నారు. శ్మశానం ఆక్రమణకు గురైందని, వెళ్లడానికి సరైన దారి, బర్నింగ్ షెడ్, బోరు సౌకర్యం లేదన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 38 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లానలుమూలల నుంచి 38 మంది అర్జీదారులు హాజరై సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించారని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఇందులో కుటుంబ తగాదాలు 8, వేధింపులు 2, భూ తగాదాలు 8, డబ్బు తగాదాలు 4, చిన్న గొడవలు 3, పోలీసు సేవలు 6, ఆస్తి తగాదాలు 6, దారి సమస్య 1 చొప్పున అందాయి.

పీజీఆర్ఎస్ వినతులపై శ్రద్ధ చూపండి

● డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు ఇప్పటి వరకు 67 వేల వినతులు అందాయని, వాటి రీ ఓపెన్‌కేసులపై శ్రద్ధ చూపాలని డీఆర్వో మోహన్‌కుమార్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన మండల స్పెషలాఫీసర్లతో, జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. బుధ లేదా గురువారం ఏదో ఒకరోజు మండల ప్రత్యేక అధికారులు మండల పరిధిలోని అన్ని వ్యవస్థలను తనిఖీలు చేయాలని అన్నారు. వారికి కేటాయించిన మండలంలో మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించాలని చెప్పారు. జిల్లాలో అన్ని రకాల గ్రీవెన్స్‌లో పెండింగ్‌లో ఉన్న వినతుల్లో టాప్‌టెన్‌లో రెవెన్యూ, సర్వే, పోలీసు, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, పౌరసరఫరాలు, గృహనిర్మాణం, విద్య, డీఆర్డీఏ శాఖలు ఉన్నాయని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు పాల్గొన్నారు.

మహానందికి వైభవంగా ప్రదోషకాల పూజ



మహానందికి హారతి ఇస్తున్న ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్

ఐరాల(కాణిపాకం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో వెలసిన మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోష కాల పూజను ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్ వైభవంగా నిర్వహించారు. మణికంఠేశ్వర స్వామి ఆలయంలో లోపల శివునికి, వెలుపల మహానందికి ఏక కాలంలో అభిషేకం నిర్వహించారు. అనంతరం శివుడిని, మహానందిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రదోష కాల పూజను వీక్షించడానికి వందలాదిగా భక్తులు మణికంఠేశ్వర ఆలయానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి



సుబ్రమణ్యంరెడ్డి మృతదేహం

బంగారుపాళ్యం నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలో కేజీ సత్రం వద్ద వైష్ణవి డాబా సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... మహాసముద్రం గ్రామానికి చెందిన రంగారెడ్డి కుమారుడు ఈ.సుబ్రమణ్యంరెడ్డి అలియాస్ బాబు (48)ని వైష్ణవి డాబా వద్ద రోడ్డు పక్కన వెళుతుండగా చిత్తూరు వైపు నుంచి బెంగళూరుకు వెళుతున్న కర్నాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రమణ్యంరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన లంకిపల్లె పద్మావతి, శివసుబ్రహ్మణ్యం నాయుడు రూ.1,00,700, కడప జిల్లా పులివెందులకు చెందిన తిరుమల రెడ్డి రూ.1,00,116 విరాళంగా సోమవారం అందించారు. విరాళదాతలను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం దాతలను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే మార్గం



సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కార ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమున్నత సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే చక్కటి మార్గాన్ని నిర్దేశిస్తాయని పలువురు పేర్కొన్నారు. ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ విభాగం- ఇన్‌ఫ్లిబ్‌నెట్ సంయుక్తంగా మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును చేపట్టాయి. 'లైబ్రరీ-2047: డెమొక్రటైజింగ్ నాలెడ్జ్ టువర్డ్స్ వికసిత్ భారత్' అంశంపై శ్రీనివాసా ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఎస్వీయూ వీసీ నరసింగరావు మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర వహించాల్సి ఉందన్నారు. గ్రంథాలయాలున్న ప్రాంతాల్లో మనుషుల్లో అవగాహన, చైతన్యం ఎక్కువగా కనిపిస్తాయని శ్రీలంక యూనివర్సిటీ వీసీ కొలిత్ వీజే శేఖర్ అభిప్రాయపడ్డారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకోవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు సూచించారు. మంచి కెరీర్‌తో పాటు మంచి విలువలను పాటించాలంటే మంచి పుస్తకాలను చదవాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. విద్యాసంస్థల్లో, గ్రామాల్లో, పట్టణాలు, నగరాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడమే కాదు, ఆధునిక కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) వీసీ ఉమాకంజిలాల్ కోరారు. గ్రంథాలయాలను డిజిటలైజ్ చేయవలసిన అవసరం ఉందని ఇన్‌ఫ్లిబ్‌నెట్ డైరెక్టర్ దేవకిమదల్లి చెప్పారు. సకాలంలో, సక్రమంగా గ్రంథాలయాల ద్వారా పౌరులకు సమాచారం అందితేనే ప్రజాస్వామిక.. మానవీయ విలువలు పెంపొందుతాయని అంతర్జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు పేర్కొన్నారు. పాఠకుల ఆదరణకు నోచుకునేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దాలని ఇన్‌ఫ్లిబ్‌నెట్ కేంద్ర ప్రతినిధి సురభి కోరారు. ఐటీతో గ్రంథాలయాలు కొత్త మార్గంలో గమనాన్ని సాగిస్తున్నాయని ఇన్‌ఫ్లిబ్ నెట్ ప్రతినిధి సుదర్శనరావు తెలిపారు. ఈ సదస్సుకు 500 మంది దేశ, విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. పేపర్, పోస్టర్, ఓరల్ ప్రెజెంటేషన్ చేశారు. దేశంలోనే సీనియర్ లైబ్రరీ సైన్స్ ప్రొఫెసర్ కరిసిద్ధప్పను, ఎస్వీ పాలిటెక్నిక్ లైబ్రేరియన్ నటరాజ నాయుడును సత్కరించారు. ఈ సదస్సు సందర్భంగా గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి 1.3 లక్షల పుస్తకాలను సేకరించి, భద్రపరిచి, డిజిటలైజేషన్ చేస్తున్న లంకా సూర్యనారాయణను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి పాండ్ర సురేంద్రబాబు తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో లంకా సూర్యనారాయణను సన్మానించారు.

రూ.15వేల పింఛన్ ఇవ్వండి



రూ. 15వేల పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని పుంగనూరు మండలం నక్కలబండకు చెందిన వికలాంగుడైన రిజ్వాన్ కోరారు. తన తండ్రితో కలిసి పీజీఆర్ఎస్‌కు హాజరై కలెక్టర్‌కు అర్జీని ఇచ్చాడు. తనకు దివ్యాంగుల కోటా కింద ప్రస్తుతం రూ.6వేలు పింఛన్ వస్తుందన్నారు. ప్రస్తుతం వెన్నుపూస సమస్య కారణంగా రెండుకాళ్లు పనిచేయని కారణంగా రూ.15వేలు పింఛన్‌ను మంజూరు చేయాలని కోరారు.

మిట్టూరు మహిళ ఆత్మహత్యాయత్నం



తన పొలానికి వెళ్లే దారి సమస్యను అధికారులు పరిష్కరించడం లేదంటూ వి.కోట మండలం మిట్టూరుకు చెందిన నందిని పురుగుల మందు తాగబోయారు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా నందిని మాట్లాడుతూ తనకున్న ఎకరం భూమి వద్దకు వెళ్లడానికి దారి లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోయింది. పలుమార్లు స్థానికంగా ఉన్న వీఆర్వో, తహసీల్దార్‌కు విన్నవించుకున్నా ఫలితం లేదని తెలిపారు.చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఆమెను పరీక్షించిన డాక్టర్లు పురుగుల మందు తాగలేదని, ఆమె బాగానే ఉందని చెప్పారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

నిస్సహాయ తల్లిదండ్రులకు భరణం తప్పనిసరి



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వరతేజ

కుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిస్సహాయ తల్లిదండ్రులకు పిల్లలు తప్పనిసరిగా భరణం చెల్లించాల్సి ఉంటుందని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.వరతేజ అన్నారు. ఎట్టణంలోని రైల్వే స్టేషన్, ఎన్జీవో హోమ్‌లలో సోమవారం 'తల్లిదండ్రులు, జూనియర్ సిటిజన్స్ నిర్వహణ సంక్షేమ చట్టం గురించి అవగాహన సదస్సు జరిగింది. ప్రధాన వక్తగా ఆయన పాల్గొన్నారు. వరతేజ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, జూనియర్ సిటిజన్లకు ఈ చట్టం ఆసరా ఇస్తుందన్నారు. తమను తాము పోషించుకోలేని తల్లిదండ్రులు, జూనియర్ సిటిజన్లకు ఆర్థిక, వైద్య, రోజువారీ సంరక్షణకోసం పిల్లలు తప్పనిసరిగా భరణం అందించాలని చట్టం చెబుతుందన్నారు. సంరక్షణ షరతుతో సీనియర్ సిటిజన్లు తమ ఆస్తిని బదిలీ చేశాక, ఆ వ్యక్తి సంరక్షణ అందిండంలో విఫలమైతే, సదరు బదిలీని రద్దు చేయడానికి ఈ చట్టం అనుమతిస్తుందన్నారు. నిరాధార, సీనియర్ సిటిజన్లకోసం ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను నిర్దేశిస్తుందన్నారు. వృద్ధులను పోషించాల్సిన బాధ్యతను విస్మరించినా లేదా వారిని వదిలివేసినా జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారని హెచ్చరించారు. సదస్సులో పారా లీగల్ వలంటీర్ ఎ.మహేశ్, ఆర్పీఎఫ్ పోలీస్, ఏఎస్ఐ అమరేశ్, రైల్వే పోలీస్, ఎన్జీవో ప్రతినిధులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారానికి వెళ్లి..చెరువులో శవమై తేలి..

● అనుమానాస్పద స్థితిలో హోసూరు యువకుడి మృతి



గుడుపల్లె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చెరువులో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలివి..కర్నాటక హోసూరుకు చెందిన గోకుల్ శేఖర్(23) ఇక్కడి పరిసర గ్రామాల్లో ఎండుచేపల వ్యాపారం చేసేవాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనం మీద ఎండు చేపలను తీసుకుని బయటకు బయలుదేరాడు. ఎప్పటిలా సాయంత్రం ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు ఫోన్‌కు చేశారు. కానీ స్విచ్చాఫ్‌గా గుర్తించారు. స్నేహితులకు ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. ఈక్రమంలో సోమవారం ఉదయం ఓఎన్ కొత్తూరు చెరువులో ఓ యువకుడి శవాన్ని పశువుల కాపరులు గుర్తించారు. వారు వెంటనే గుడుపల్లె పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ శ్రీనివాసులు చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీయించారు. మృతుడి దగ్గర లభించిన ఆధారాలను బట్టి గోకుల్ శేఖర్‌గా గుర్తించారు. అతని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు పోలీసులు తెలిపారు.

స్కూల్ వంట గదిలో దెబ్బతిన్న సీలింగ్



ఊడిన సీలింగ్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో తిరుమలమ్మ



వంట గదిలో పడిన సీలింగ్ పెంకులు

చౌడేపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వంగ్రివాకులపల్లె ఎంపీపీ స్కూలు వంట గదిలో సీలింగ్ కొంత భాగం ఊడి పడింది. సోమవారం ఈ సంఘటన జరిగింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసే ఈ గది నాసిరకంగా నిర్మించటంతో సీలింగ్ సిమెంట్ ఊడిపడిందని చెబుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మలు వెంటనే చేరుకుని వంటగదిని పరిశీలించారు. ప్రమాద భరితంగా ఉన్న సీలింగ్‌ను తొలగించి, మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తోతాపురి బకాయిలు త్వరగా చెల్లించండి

గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలను కోరిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు.కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన మామిడి పండ్ల పరిశ్రమల యజమానులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోతాపురి మామిడి రకానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో కిలోకు రూ.12 మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వ సబ్సిడీ కింద రూ.4 చొప్పున 31,929 మంది రైతుల ఖాతాల్లో రూ.146.84 కోట్లు సీఎం జమచేయించారన్నారు.మిగిలిన 8 రూపాయలను రైతులకు గుజ్జు పరిశ్రమలు త్వరగా చెల్లించాలని కోరారు. గుజ్జు పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, విద్యుత్ చార్జీల సమస్యలు, మౌలిక వసతుల కల్పన తదితరాల్లో ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కాబట్టి మామిడి రైతులకు చెల్లించాల్సిన మద్దతు ధర విషయంలో నిర్ణీత సమయం నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమల నుంచి ఎంత ధర, ఏ తేదీల్లో రైతులకు చెల్లిస్తారో తెలపాలని యాజమాన్యాలను కోరారు. రైతు కష్టాన్ని దృష్టిలో పెట్టుకుని ధరలను కలెక్టర్‌కు సూచించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మద్దతు ధర విషయంలో గుజ్జు పరిశ్రమలు, రైతులు పరస్పర సహకారంతో ముందుకెళ్లాలన్నారు. గుజ్జు పరిశ్రమల యజమానులు మాట్లాడుతూ యూరోపియన్ దేశాల్లో దిగుమతి సుంకాలు ఎక్కువ కావడంతో ఇబ్బంది పడుతున్నామంటూ నిస్సహాయత వ్యక్తం చేశారు. మ్యాంగో పల్ప్‌పై విధిస్తున్న జీఎస్టీని తగ్గించాలని, మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఉద్యానశాఖ డీడీ మధుసూదన రెడ్డి,పలు పల్ప్ కంపెనీల యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ స్థల ఆక్రమణకు యత్నం

తిరుపతి(వైద్యం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ ఆస్పత్రి స్థలంలో గేటు నిర్మాణ పనులు చేపడుతుంటే కొందరు ఆ స్థలం తమదంటూ పనులను అడ్డుకున్నారు. అంబులెన్సులు, భారీ వాహనాలు ఆస్పత్రిలోకి సులువుగా వచ్చేందుకు వీలుగా ప్రధాన ముఖద్వారం పక్కన అదనంగా మరో గేటును ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా కొందరు వచ్చి ఆ స్థలం తమదంటూ వాదనకు దిగారు. అది ఆస్పత్రి స్థలమని రికార్డులు చూపించినా వారు వినిపించుకోలేదు. అనంతరం ఆస్పత్రి అధికారులు, సిబ్బంది కలిసి వాదనకు దిగటంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. 1991లో ఈఎస్ఐ ఆస్పత్రికి 6.45 ఎకరాల స్థలాన్ని కేటాయించారని, ఈ స్థలంలోనే అదనపు గేటు నిర్మాణాన్ని చేపడుతుంటే ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారని సూపరింటెండెంట్ శ్యాంబాబు తెలిపారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్



కొబ్బరిచెట్లును ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు - - విరిగిపోయిన మామిడిచెట్టు

కల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట వద్ద సోమవారం ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి ఆదివారం రాత్రి బయలుదేరిన ఒంటరి ఏనుగు పాతపాళ్యం గుట్ట మార్గంలో పాతపేట వద్దకు చేరుకుంది. రైతులు శ్రీరాములు, వెంకటాచలం, నందగోపాల్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రామూర్తికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. కొబ్బరిచెట్లు, పనసచెట్లు, అరటిచెట్లను ధ్వంసం చేసి పశుగ్రాసాన్ని మేసేసింది. నీటి పైపులు, గేటువాల్వ్‌లను ధ్వంసం చేసింది. తర్వాత మరి కొందరి రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకుంది. సోమవారం పగలంతా అడవిలోని గోగులమ్మ వంక వద్ద ఒంటరి ఏనుగు సంచరించినట్లు ప్రజలు తెలిపారు.

ఈత సరదాతో లక్ష్మయ్యవూరు విద్యార్థి మృతి



నిఖిల్ (ఫైల్‌ఫొటో)

పూతలపట్టు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహాబలిపురం బీచ్‌లో ఓ బీటెక్ విద్యార్థి గల్లంతయ్యాడు. పూతలపట్టు మండలం వావిల్‌తోట పంచాయతీ లక్ష్మయ్యవూరుకు చెందిన ఆనంద నాయుడి కుమారుడు నిఖిల్ చెన్నైలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి శనివారం మహాబలిపురం వద్ద ఉన్న బీచ్‌కి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి నిఖిల్ గల్లంతయ్యా డు. ఆదివారం బయటపడ్డ నిఖిల్ మృతదేహాన్ని కుటుంబీకులు సోమవారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ నాయకులు గంగారపు గోపి, దొరబాబు, చంద్రమౌళి, గంగారపు హరి, మధు, నాదముని, గోవర్దన్, జగన్నాథం, నరసింహులు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

మొరవ పారడానికి సిద్ధంగా డీకేపల్లె చెరువు


మొరవను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు

కుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దళవాయికొత్తపల్లె చెరువు మొరవ పారడానికి సిద్ధంగా ఉంది. ఇటీవల భారీ వర్షాలతోపాటు, హంద్రీ-నీవా కాలువ ద్వారా వచ్చిపడుతున్న కృష్ణా జలాలతో చెరువు నిండింది. సోమవారం చెరువునుంచి మొరవ ద్వారా సన్నపాటి కాలువల రూపంలో మొరవ పారడం ప్రారంభమైంది. చెరువును ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, సిబ్బందితో కలిసి సోమవారంపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు చెరువు దగ్గరకు రాకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.ఇంటింటికీ తాగునీటి కుళాయి కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు

ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వ కృషి


నరసింహులును సన్మానిస్తున్న నేతలు

రామకుప్పం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్టీల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. ఎస్టీసెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను సోమవారం గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డిల నేతృత్వంలో పలువురు నేతలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కూడా టీడీపీ పాలనలోనే ఎస్టీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన జరిగిందన్నారు. నాయకులు సీతాపతి, రామ్మూర్తి, రామకృష్ణప్ప, రఘు, రెస్కో మనోహర్, పాల్గొన్నారు.

విద్యార్థుల కార్తీక వన సమారాధన


జలపాతం వద్ద చిన్నారుల కోలాహలం

రామకుప్పం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విజలాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం చెలిమిచేను జలపాతం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన సమారాధనలో పాల్గొన్నారు.రహదారికిరువైపులా మొక్కలు నాటారు. సందడి సందడిగా గడిపారు. అనంతరం అటవీ ఉపక్షేత్రాధికారి ధనుంజయుడు వనసంరక్షణ, వన్యప్రాణుల రక్షణపై అవగాహన కల్పించారు. అటవీ అధికారులు హరిబాబు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

సోమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎపిక అయినట్లు హెచ్‌ఎం. శిరీష తెలిపారు. ఇటీవల చిత్తూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ - 17 విభాగంలో ఎం. మధుప్రియ, అండర్ 14 విభాగంలో ఎస్. మహమ్మద్‌తౌఫిక్, మహమ్మద్ అఫ్సాన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. పశ్చిమగోదావరి, పులివెందుల్లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పీడీ. ఎం. శివకుమార్ తెలిపారు.

రైతు సంఘాల ఏర్పాటుతో లబ్ధి


గ్రామసభలో మాట్లాడుతున్న పవన్‌కుమార్

రామకుప్పం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు సంఘాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ద్వారా అన్ని సదుపాయాలు అందేలా చూడాలని ఏఎంసీ డైరెక్టరు పవన్‌కుమార్ కోరారు. సోమవారం బల్లలో సచివాలయ సిబ్బంది, సంఘమిత్రల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించాలన్నారు. వీహెచ్‌ఏ ఆసిన్, నేతలు శ్రీనివాసులు, మురుగేష్ పాల్గొన్నారు.

'ఉజ్వల' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


అర్జీదారులతో మాట్లాడుతున్న మధుసూదన్

సోమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎస్టీలకు అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ కనెక్షన్ ఉజ్వల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మధుసూదన్ కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వినతులను స్వీకరించారు. మండలంలోని పలువురు ఎస్టీలకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేవని వినతులు అందాయి. పలువురు యానాదులు తమ అనుభవంలోని సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఇరికిపెంట, వల్లిగట్ల తదితర ప్రాంతాల్లో అటవీభూములు, రెవెన్యూభూముల సరిహద్దు వివాదాలు తీర్చాలని అర్జీలు అందజేశారు. ఆయన వీఆర్వోలతో సమావేశమై ఆర్జీలపై తక్షణ పరిష్కారం కోసం క్షేత్రస్థాయి సందర్శనలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

స్వామిత్వ పత్రాల పంపిణీ


స్వామిత్వ పత్రాన్ని అందజేస్తున్న రామచంద్ర

చౌడేపల్లె, నవంబరు17(ఆంధ్రజ్యోతి):స్వామిత్వ హక్కు పత్రాలను డీఎల్‌డీవో రామచంద్ర సోమవారం పంపిణీ చేశారు. గడ్డంవారిపల్లె పంచాయతీలో స్వామిత్వ గ్రామ సభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వామిత్వపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలకు సాంకేతికతో కచ్చితమైన భూహక్కులు కల్పించేందుకే స్వామిత్వ అని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, ఈవోఆర్డీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



రామకుప్పం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విజలాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమ వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఏఎన్‌ఎం శైలజ, ఎంఎల్‌హెచ్‌పీలు సంధ్య, కావ్య, లావణ్య పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈడిగపల్లె చెక్‌పోస్టు తనిఖీ


రికార్డు పరిశీలిస్తున్నశమీపతి

పుంగనూరు రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఈడిగపల్లె చెక్ పోస్టును సోమవారం ఏఎంసీ ఛైర్మన్ శమీపతి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవరించరాదని, ప్రభుత్వానికి ఆదాయ వసరుల సేకరణ కోసం కృషి చేయాలని కోరారు. నాయకులు ఆంజి, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

పుంగనూరు రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ అదాలత్‌లో పుంగనూరు, సదుం, పలమనేరు సబ్‌డివిజన్ల పరిధిలోని రైతులు, వినియోగదారులు హాజరుకావాలని కోరారు. విద్యుత్‌శాఖ ఛైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్, సభ్యులు శ్రీనివాసబాబు, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి హాజరుకానున్నట్లు తెలిపారు.

ననియాలకు రెండు ఏనుగుల తరలింపు


ననియాలకు బయలు దేరిన వినాయక్, జయంత్‌లు

పలమనేరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : మొసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపు నుంచి వినాయక్, జయంత్ అనే రెండు ఏనుగులను సోమవారం రామకుప్పం మండలంలోని ననియాల క్యాంపునకు తరలించారు. గతంలో ఇక్కడ ఏనుగులను కొన్నేళ్లపాటు శిక్షణకు ఉంచారు. ఈక్రమంలో ఇటీవల కుప్పం నియోజకవర్గంలో ఏనుగుల సంచారం ఆందోళన కలిగిస్తుండటంతో వాటి కట్టడికి వినాయక్, జయంత్‌లను తరలిస్తున్నట్లు తెలిసింది.

పుంగనూరు టీడీపీకి పూర్వ వైభవం


అమరనాథరెడ్డి

పుంగనూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులంతా కలసికట్టుగా పనిచేయాలని నియోజకవర్గం పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు కె.అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం పెద్దగొట్టిగల్లులో జరిగిన సమావేశంలో పరిశీలకుడిగా నియమితులైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో టీడీపీకి ఈ నియోజకవర్గం కంచుకోటగా ఉండేదని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో కొద్ది తేడాతో ఓటమి ఎదురైందన్నారు. రెట్టించిన ఉత్సాహంతో పార్టీ కార్యకర్తలందరూ కృషి చేస్తే వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగురవేయడం తథ్యమన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

20న సావిత్రమ్మ కాలేజీలో జాబ్‌మేళా

చిత్తూరు సెంట్రల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కేరీర్ గైడెన్స్ కో-ఆర్డినేటర్ అక్తర్ సోమవారం తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు కళాశాలకు రావాలని కోరారు. వివరాలకు 94403 32708, 89197 15836 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆక్రమణకు రెవెన్యూ సిబ్బంది అడ్డుకట్ట

పూతలపట్టు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించడంతో రెవెన్యూ సిబ్బంది రెండు ట్రాక్టర్లు, ఓ ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీ టి.కె.పల్లి సమీపాన అడ్డగుట్ట ఉంది. ఈ అడ్డగుట్టను కబ్జాచేసేందుకు భూమిని కొంతమంది చదునుచేయగా, సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసులు అక్కడికి వెళ్లి రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు.

గ్రామ స్థాయి నుంచి టీడీపీ బలోపేతానికి కృషి




మాట్లాడుతున్న రవినాయుడు, వేదికపై చల్లారామచంద్రారెడ్డి,కె.అమరనాథరెడ్డి,అశోక్ తదితరులు- హాజరైన నాయకులు,కార్యకర్తలు

రొంపిచెర్ల,నవంబరు17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గ్రామ, యూనిట్, బూత్ కమిటీలు రానున్న సంస్థాగత ఎన్నికల్లో విజయం సాధించేందుకు పాటుపడాలని టీడీపీ పర్యవేక్షకులు ఏ.రవినాయుడు, కె.అమరనాధరెడ్డి, వై.అశోక్‌లు సూచించారు. రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు సమీపంలోని మంగమ్మగార్డెన్‌లో పుంగనూరు, చౌడేపల్లి, సదుం, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో గ్రామ కమిటీల ఏర్పాటుపై సమీక్షా సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కమిటీలు ఏర్పాటుకు పర్యవేక్షకులను పార్టీ ఏర్పాటు చేసిందని, అందరూ పార్టీకి, ప్రజలకు సేవలు అందించే వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. గతంలో పార్టీ జెండా మోసిన వారికి, జైయిల్‌కు వెళ్లిన వారికి పదవుల్లో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అక్రమ కేసుల గురించి ప్రస్తావిస్తూ అధైర్యపడకుండా ఐక్యతతో పనిచేయాలని కోరారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తకు ఏ సమస్య వచ్చినా ఆదుకుంటామన్నారు. సోమల మండలానికి ఎం.ప్రభాకర్, రొంపిచెర్లకు పి.రమేష్, సదుంకు సి.శ్రీనివాస్, పులిచెర్లకు ఏ.ప్రతాప్ రాజు, చౌడేపల్లెకు నాగేశ్వర్‌నాయుడు, పుంగనూరుకు మహేష్‌యాదవ్, మండలానికి జి.శేతప్ప పర్యవేక్షకులుగా ఉంటారన్నారు. సభకు భారీగా కార్యకర్తలు హాజరయ్యారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణవంశీ

పుంగనూరు రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగివుండాలని జూనియర్ సివిల్ జడ్జి కృష్ణవంశీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంసీవీ కాలేజీ ఆవరణలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ వృద్ధుల పట్ల ఆదరాభిమానాలు చూపించి పోషించాలన్నారు. తల్లిదండ్రులపై నిర్లక్ష్యంగా వ్యహరించినట్లు ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తారన్నారు.. సమావేశంలో కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా టీడీపీ పటిష్టతకు కృషి


పార్టీ పతాకావిష్కరణలో మునిరత్నం, నాయకులు

రామకుప్పం,/శాంతిపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం చెంగుబల్ల, 121పెద్దూరు గ్రామాల్లో సోమవారం టీడీపీ పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశాలు జరిగాయి. సమావేశాలకు ముందు ఆయా గ్రామాల్లో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ మునిరత్నం పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు విభేదాలు విస్మరించి కలిసికట్టుగా పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నందిగం ఉదయ్‌కుమార్, మంజునాథ్, నేతలు రాజేంద్ర, చంద్ర, గోపాల్, ఆర్ఎస్‌మణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ


పట్టు రైతులకు పరికరాలు పంపిణీ చేస్తున్న మునస్వామి తదితరులు

రామకుప్పం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, టీడీపీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి కామరాజనాయక్‌లు అన్నారు. సోమవారం రామకుప్పంలో మండలంలోని పట్టు రైతులకు రూ.20లక్షలు విలువైన వ్యవసాయపరికరాలు, క్రిమిసంహారక మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పట్టుపరిశ్రమశాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం, మిగిలిన రైతులకు వ్యసాయపరికారాలు, క్రిమిసంహారకాలను పంపిణీ చేస్తోందన్నారు. విరివిగా గోకులంషెడ్లు, 90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికారలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమశాఖ కుప్పం ఏడీ మోహన్‌బాబు, కడా పీఏసీ మెంబర్ రఘు, సింగిల్‌విండో ఛైర్మన్ మహ్మద్‌రఫీ, రెస్కో డైరెక్టరు మనోహర్, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, నేతలు రామ్మూర్తి, గంటప్పగౌడు, భానుమూర్తి, మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం


కవులను సన్మానిస్తున్న గ్రంథాలయాధికారి తదితరులు

పలమనేరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారరోత్సవాల్లో భాగంగా సోమవారం కవిసమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో కవి శివకుమార్ మాట్లాడుతూ కవులు తమ జ్ఞానాన్ని కథలు, కవితల రూపంలో సమాజ పురోగతికి అందిస్తారన్నారు. సమాజ హితవు కోరేది కవిత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు శివకుమార్, శ్రీనివాస్‌లను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. గ్రంథాలయాధికారి హేమకుమార్, పలమనేరు రచయితలసంఘం అధ్యక్షులు ఆర్.మాధవ్, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి యుగందర్‌బాబు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌కు కుర్చీల వితరణ


గ్రామ సేవాసమితి అధ్యక్షుడిని సన్మానిస్తున్న లాయర్లు

పలమనేరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ బార్ అసోసియేషన్‌కు శివాడిలోని గ్రామసేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, ధనంజయలు సోమవారం కుర్చీలు వితరణగా అందజేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్ వారికి కృతజ్ఞతలు తెలియజేయడంతోపాటు అధ్యక్షులు రామ్మూర్తిని శాలువకప్పి ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ లాయర్లు పాల్గొన్నారు.

పచ్చదనంపై శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

సోమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పర్యావరణ పచ్చదనంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో జీవీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లోని డంపింగ్ యార్డులకు చెత్త నిల్వలను తరలించి వర్మీకంపోస్టు విధిగా తయారు చేసి పంచాయతీలకు ఆదాయవనరులు కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీదేవి, సర్పంచులు కోదండరాజు,వెంకటరమణ, రెడ్డెప్ప, సౌజన్య ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాల పరిశీలన

రొంపిచెర్ల,నవంబరు17(ఆంధ్రజ్యోతి): గ్రామాలలోని బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన విడనాడాలని స్వచ్ఛ భారత్ పరిశీలకులు ఎంపీడీవో రాధారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆదినారాయణ, ఎంఆర్సీ సుబ్రహ్మణ్యంలు హితవు పలికారు. సోమవారం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని గ్రామాల్లో మరుగు దొడ్ల నిర్మాణాలు, వినియోగం పరిశీలించి సూచనలు ఇచ్చారు. బాహ్య ప్రదేశాల్లో మల మూత్ర విసర్జలతో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు.

మాల మహానాడు నేతకు సత్కారం


అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న దళితసంఘ నాయకులు

పుంగనూరు రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పుంగనూరుకు చెందిన అశోక్‌కుమార్‌ను ఎంపికైయ్యారు. ఆదివారం మదనపల్లెలో జరిగిన రాష్ట్ర నూతన కార్యవర్గంలో ఎంపికైన ఈయనను ఇక్కడి మాలమహానాడు నాయకులు సోమవారం సన్మానించారు. సంఘనాయకులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బెల్టు షాపులపై స్పందన ఇలాగేనా?

● ఎక్సైజ్ అధికారులపై మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం


ఎక్సైజ్ సిబ్బందిని ప్రశ్నిస్తున్న జడ్పీటీసీ కృష్ణమూర్తి

గుడుపల్లె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదంటూ ఎక్సైజ్ పోలీసులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. సోమవారం స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ వరలక్ష్మీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. కర్ణాటక తోపాటు మండలంలోని రెండు షాపుల నుంచి నిత్యం మద్యం బెల్టు షాపులకు సరఫరా అవుతోందని సభ్యులు పేర్కొన్నారు. అరికట్టాల్సిన అధికారులు మాముళ్ల మత్తుల్లో ఉంటున్నారన్నారు. దీంతో గ్రామాల్లో శాంతి భద్రత సమస్య తలెత్తుతోందని ఎంపీపీ వరలక్ష్మీ, జడ్పీటీసీ క్రిష్ణమూర్తిలు మండిపడ్డారు. కాగా పంచాయతీలకు నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటపడిందని కొడతనపల్లె సర్పంచ్ వెంకటేశు ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీ నీవా జలాలతో చెరువులు నిండి రైతుల ఆనందానికి కారకులైన సీఎం చంద్రబాబు నాయుడుకు సర్పంచులు. ఎంపీటీసీలు ధన్యవాదాలు తెలిపారు. మండల సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ మునిరాజు, తహసీల్దారు సీతారామ్, ఎంపీడీవో రాధాక్రిష్ణ, పలువురు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

హర హర మహాదేవ...

శైవ క్షేత్రాల్లో కార్తీక సందడి..మార్మోగిన శంకరుడి నామస్మరణ


ప్రత్యేక అలంకరణలో స్వయంభేశ్వరస్వామి

సోమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. స్థానిక స్వయంభేశ్వరస్వామి ఆలయంలో కార్తీమాసోత్సవాలు చివరి, నాలుగో సోమవారం పురస్కరించుకుని ఘనంగా కుంభాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విశేష పుష్పాలంకరణ జరిపి అభిషేకపూజలు జరిపారు. ఉభయదారులు శెట్టివారి మోహన్ కుటుంబసభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి కార్తీకదీపాలు వెలిగించారు. పెద్దఉప్పరపల్లె సమీపంలోని దుర్గంకొండ, మల్లేశ్వరస్వామి ఆలయం, మధురమలై కొండ నేల మల్లేశ్వర స్వామి ఆలయాల్లో శివయ్యకు పూజలు చేశారు. **కల్లూరు:** దేవళంపేటలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అభిషేకాలు, నిర్వహించారు. పుష్పాలంకృతుడైన స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా అయ్యావాండ్లపల్లి పంచాయతీ మంగళపల్లికి చెందిన కుమార్ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

చౌడేపల్లె: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు భక్తులకు కేదారీశ్వర నోముల వ్రత కథను వివరించి వ్రతాన్ని అచరింపజేశారు. **పుంగనూరు రూరల్:** స్థానిక భోగసంజుండేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి, కాశీవిశేశ్వరస్వామి, అగస్తీశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వారిని అలంకరించి అభిషేకాలు చేసి భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. ఉపవాసాలతో స్వామి వారిని దర్శించుకున్నారు


చౌడేపల్లి అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో కేదారి నోము గురించి భక్తులకు వివరిస్తున్న అర్చకుడు


ప్రత్యేక అలంకరణలో అగస్తీశ్వరస్వామి

కటారి దంపతుల సేవలు మరువలేనివి: ఎంపీ



అన్నదానం చేస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత తదితరులు

చిత్తూరు సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మేయర్ కటారి అనురాధ, కటారి మోహన్ దంపతులకు టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం కటారి దంపతుల 10వ వర్థంతి సందర్భంగా నగరంలోని పలు డివిజన్‌లలో వారి చిత్రపటాలకు నివాళులర్పించి అన్నదానం చేశారు. స్థానిక ఎమ్మెస్సార్ సర్కిల్‌లో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్మన్ కటారి హేమలత తదితరులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ టీడీపీకి కటారి దంపతులు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ కటారి దంపతులు పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడారని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ కటారి దంపతులు మరణించినా వారి జ్ఞాపకాలు, వారు చేసిన సేవలు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు. నగరపాలక సంస్థ కార్యాలయం, కొంగారెడ్డిపల్లె, గాంధీ సర్కిల్, మార్కెట్ చౌక్, దర్గా సర్కిల్, మురుకంబట్టు, సంతపేట, గంగనపల్లి, ఇరువారం, లెప్రసీ కాలనీ తదితర ప్రాంతాల్లో కటారి దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, కిరణ్, లావణ్య, హేమలత, ఓయం రామదాసు, కంద, కోలా కిరణ్, రాజశేఖర్, ఆనంద్, శేషాద్రి, యువరాజులు నాయుడు, నీల, సబిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

'పీజీఆర్‌ఎస్'కు 13 వినతులు



బాధితురాలితో మాట్లాడుతున్న ఏసీ ప్రసాద్

చిత్తూరు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి 13 వినతులు అందాయని అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రెవెన్యూకు 5, ఇంజనీరింగ్‌కు 4, టిడ్కోకు 3, పింఛన్‌కు ఒక్క అర్జీ చొప్పున అందాయి. కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పెనుమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని రామకృష్ణాపురం రైతుసేవా కేంద్రంలో రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. అనవసరమైన పంటలకు యూరియా వాడకూడదని ఆయన సూచించారు. సామిరెడ్డిపల్లి, గంగుపల్లి, తాటిమాకులపల్లి రైతేసేవా కేంద్రాల్లో కూడా యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏవో సుహర్‌లత, వీఏఏ డిల్లీబాబు పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి సన్మానం



శివనాయుడిని సన్మానిస్తున్న కార్వేటినగరం పీఏసీఎస్ చైర్మన్ జనార్థన్‌రాజు

పాలసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరి శివనాయుడు అన్నారు. నూతనంగా ఎంపికైన పాలసముద్రం టీడీపీ మండలాధ్యక్షుడు శివనాయుడిని సోమవారం రంగాపురంలోని ఆయన స్వగృహంలో కార్వేటినగరం మండలం సింగిల్‌విండో చైర్మన్ మాదిరాజు జనార్థన్‌రాజు శాలువకప్పి, పూలమాలవేసి సన్మానించారు. అనంతరం టీడీపీ నేతలతో పార్టీ పటిష్టతకు చేయాల్సిన ప్రణాళికలపై ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో పెనుమూరు ఏఎంసీ వైస్‌చైర్మన్ అరుల్‌నాధన్, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి సాంబశివన్, నేతలు బాలాజి నాయుడు, రోశి నాయుడు, నవీన్ చౌదరి పాల్గొన్నారు.

పీసీఎన్ ఉన్నత పాఠశాలలో కవి సమ్మేళనం



కవి సమ్మేళనం నిర్వహిస్తున్న గురుమూర్తి, ఉపాధ్యాయులు

నగరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరి పీసీఎన్ ఉన్నత పాఠశాలలో 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయాధికారి గురుమూర్తి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామల, ఉపాధ్యాయులు రేవతి, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తాం

వెదురుకుప్పం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తామని కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజల నుంచి ఏడు వినతిపత్రాలు వచ్చాయని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డీటీ లోకేశ్‌యాదవ్, ఆర్ఎస్ డీటీ స్వరూపరాణి, సర్వేయర్ మార్కండేయులు, ఆర్ఐ నరసింహులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

20న 'సావిత్రమ్మ'లో జాబ్‌మేళా

చిత్తూరు సెంట్రల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కేరీర్ గైడెన్స్ కో-ఆర్డినేటర్ అక్తర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో 20న ఉదయం 10 గంటలకు కళాశాలకు రావాలని కోరారు. వివరాలకు 94403 32708, 89197 15836 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వరసిద్ధుడి సేవలో తెలంగాణ సమాచార కమిషనర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమాచార శాఖ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి సోమవారం కాణిపాకం వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంధకారంలో కలెక్టరేట్ ఫ్లైఓవర్

● ప్రమాదాల బారిన వాహనదారులు



అంధకారంలో ఉన్న కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ సర్వీసు రోడ్డు

చిత్తూరు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత 15 రోజులుగా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి అంధకారంలో ఉంది. పట్టించుకోవాల్సిన నేషనల్ హైవే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చెన్నై-బెంగళూరు నేషనల్ హైవే జాతీయ రహదారి కలెక్టరేట్ మీదుగా వెళుతోంది. ఇటు చెన్నై నుంచి వచ్చే ప్రయాణికులు, అటు బెంగళూరు నుంచి చిత్తూరుకు వచ్చే ప్రయాణికులు కలెక్టరేట్ సమీపంలో ఉన్న బస్టాప్ వద్ద దిగి అక్కడ నుంచి ఆటోల మీదుగా చిత్తూరులోని వివిధ ప్రాంతాలకు వెళుతుంటారు. స్థానిక ప్రశాంత్ నగర్ రోడ్డు నుంచి రెడ్డిగుంట వరకు ఫ్లైఓవర్ విస్తరించి ఉంది. కారు, ఇతర వాహనాల్లో చెన్నై నుంచి వచ్చే వారు రెడ్డిగుంట సర్వీస్‌రోడ్డు, బెంగళూరు నుంచి వచ్చే వారు ప్రశాంత్‌నగర్ వద్ద ఉన్న సర్వీస్‌రోడ్డులో చిత్తూరుకు చేరుకుంటారు. అలాంటి ఫ్లైఓవర్ పైన, కింద ఉన్న సర్వీసురోడ్డులో గత 15 రోజులుగా హైవే అధికారులు ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగడం లేదు. దాంతో చాలా మంది దారితప్పి వెళ్లడమేకాకుండా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫ్లైఓవర్ ఎదురుగానే కలెక్టరేట్ ఉండటంతో సాయంత్రం, రాత్రి వేళల్లో రద్దీగానే ఉంటుంది. సాయంత్రం 6 గంటల పైన ఫ్లైఓవర్ రోడ్డు, కింద ఉన్న సర్వీసురోడ్డు చిమ్మచీకటిని అలుముకుంటుంది. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నేషనల్ హైవే అధికారులు మరమ్మతుకు గురైన వీధి దీపాలను రిపేరు చేయాలని ప్రయాణికులు, కలెక్టరేట్ ఉద్యోగులు, వాహనదారులు కోరుతున్నారు.



చిత్తూరు: రాజు గుడిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు - వెదురుకుప్పం: డీఆర్ఎన్‌కండ్రిగలోని కొండ మల్లీశ్వరస్వామి - కార్వేటినగరం: ప్రత్యేకాలంకరణలో నందీశ్వరుడు - నింద్ర: విశేష అలంకరణలో నింద్రేశ్వర స్వామి - యాదమరి: భక్తులతో కిటకిటలాడుతున్న ఏకాంబరేశ్వరస్వామి ఆలయం

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

చిత్తూరు సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శివాలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. తమిళ కార్తీక పౌర్ణమి తొలి సోమవారం ప్రారంభం కావడంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని ఆలయాల్లో మహిళలు ఉదయం, సాయంత్రం దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రదోషం కావడంతో నందికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయాలను నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. నగరంలోని అగస్తీశ్వరాలయం, కట్టమంచి కుళందేశ్వరాలయం, సంతపేట కాశీ విశ్వేశ్వరాలయం (రాజుగుడి), గిరింపేట చిదంబరేశ్వరాలయం, ఇరువారం నాగేంద్రాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● వెదురుకుప్పం(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ఎగువ కన్నికాపురం వద్ద వెలసి ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్దేశ్వరస్వామికి పాలాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పరిసర గ్రామాల భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు. డీఆర్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో పాలాభిషేకం, రుద్రాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. అన్నమయ్య, శివసంకీర్తనలు, భజనలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ● కార్వేటినగరంలో శిష్ట సౌందర్య వల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ప్రదోష కాల పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● నింద్ర(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్న వినాయకస్వామి ఆలయంలో వెలసిన నింద్రేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ● యాదమరి (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని పురాతనమైన ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజాకార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని త్రివేణి సంగమం వద్ద నీవానది ఒడ్డున వెలసిన ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో స్వామి, అమ్మవార్లను వివిధ రకాల, రంగుల పువ్వులతో విశేషంగా అలంకరించారు. కార్తీక మాసం పవిత్రతను చాటేవిధంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కేరళ సంప్రదాయ వాయిద్యాలు, మంగళవాయిద్యాల మధ్య భక్తులు స్వామివారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.

రీసర్వే త్వరగా పూర్తి చేయండి

బంగారుపాళ్యం నవంబర్ 17(ఆంధ్రజ్యోతి): రీసర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని సర్వేయర్లకు, వీఆర్వోలకు తహశీల్దార్ షబ్బీర్ బాషా సూచించారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో పలు గ్రామాల నుంచి భూసమస్యలపై 20 అర్జీలు వచ్చాయని, వారంలోపు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని వీఆర్వోలకు సూచించారు. తుంబకుప్పం దళితవాడకు చెందిన కొందరు ఇళ్ల పట్టాలు మంజూరుచేయాలని తహశీల్దార్‌కు విజ్ఞప్తి చేయగా, మంగళవారం తుంబకుప్పంలో స్థల పరిశీలన చేసి అర్హులైన వారికి పొజిషన్ పట్టాలు ఇవ్వనున్నామని తెలిపారు. గతంలో రీ సర్వే జరిగిన మొగిలి, మహాసముద్రం, నూనెగుండ్లపల్లె, గుండ్లకట్టమంచి, తుంబపాళ్యం, జంబువారిపల్లె, శెట్టేరి, కూర్మాయిపల్లె, బేరిపల్లె, వేపనపల్లె గ్రామాల్లో రీ సర్వేలో జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్‌పార్శిల్ మ్యాప్) నెంబర్లు మారినవారు సచివాలయంలో చలానా కట్టి ఉమ్మడిగా ఉన్న వాటిని విభజన చేసుకోవాలని తహశీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ బాబు, సర్వేయర్ లావణ్య, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వెదురుకుప్పం ఏవోను వేధించిన విలేకరులను అరెస్టు చేయాలి

చిత్తూరు అర్బన్ నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వ్యవసాయ శాఖ అధికారిణిని వేధించిన ఇద్దరు విలేకరులను వెంటనే అరెస్టు చేయాలని ఐఎఫ్‌టీయూ నేతలు డిమాండ్ చేశారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ఈ విషయమై ఐఎఫ్‌టీయూ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఓ ఉద్యోగిని గోవిందయ్య, సుధీర్‌రెడ్డి మానసికంగా వేధించడమే కాకుండా బెదిరించడం దుర్మార్గమన్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆ ఇద్దరు విలేకరులను మందలించారన్నారు. వాటిని జీర్ణించుకోలేని కొంతమంది నిందలు మోపుతున్నారని విమర్శించారు. ఆమెకు జరిగిన అన్యాయంపై గవర్నర్, డీజీపీలకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ ధర్నాలో ఐఎఫ్‌టీయూ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాల్వలకు మరమ్మతులు చేయించండి

చిత్తూరు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌వాడ వార్డు పరిధిలో పలు మురుగుకాల్వలకు మరమ్మతులు చేయించాలని మేయర్ అముద ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె ఎంఈ వెంకట్రామిరెడ్డితో కలిసి పీహెచ్‌వాడ వార్డు పరిధిలో పర్యటించారు. చిత్తూరమ్మ గుడివీధి, భజన వీధి, మరాఠవీధి, కోర్టు డౌన్ ప్రాంతాల్లో పర్యటించారు. పలు వార్డుల్లో దెబ్బతిన్న కాల్వలను తక్షణం మరమ్మతులు చేయించాలన్నారు. అవసరమైన చోట్ల కొత్తగా నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించలేము

పూతలపట్టు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దళితులైన మేము వేలాది రూపాయల విద్యుత్ బిల్లులు ఎలా చెల్లించాలంటూ విద్యుత్‌శాఖ అధికారులను ఎర్రచెరువుపల్లి గ్రామస్తులు నిలదీశారు. మండలంలోని ఎర్రచెరువుపల్లి దళితవాడకు సోమవారం విద్యుత్ శాఖ సిబ్బంది వెళ్లి పాత బకాయిలు చెల్లించాలని, లేకుంటే మీటర్లు కట్‌చేస్తామని చెప్పారు. దీంతో దళితులంతా ఏకమై కూలీనాలి చేసుకునే మేము ఎన్నో ఏళ్లగా వున్న బకాయిలు చెల్లించాలంటే ఎలా అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు వారికి కొంత గడువు ఇచ్చి వెనుదిరిగారు.

సత్యసాయి మందిరంలో సత్యనారాయణ వ్రతం



హారతి ఇస్తున్న మహిళలు

చిత్తూరు సిటీ, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): సత్యసాయి శత జయంతి సందర్భంగా స్థానిక గిరింపేటలోని సత్యసాయి మందిరంలో సోమవారం సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. బాలవికాస్ గురువు అనురాధ ఈ వ్రతాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకు పూజా సామగ్రిని ఉచితంగా అందించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు సత్యనారాయణ, పాండురంగం, దేవరాజులు, శివప్రకాష్, సాయిప్రకాష్, శేషనారాయణ, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన టీడీపీ అధ్యక్షులు



ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును కలిసిన గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఆరు మండలాల టీడీపీ అధ్యక్షులు

వెదురుకుప్పం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జీడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సోమవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును ఎంపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి కృషి చేసి, పార్టీని పటిష్టపరచాలని అధ్యక్షులకు సూచించారు. వెదురుకుప్పం, పెనుమూరు, గంగాధరనెల్లూరు, పాలసముద్రం, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం మండలాల అధ్యక్షులు పి.మోహన్ మురళి, పెద్దినేని రుద్రయ్యనాయుడు, స్వామిదాస్, తాళ్లూరు శివ నాయుడు, గంధమనేని జయశంకర్ నాయుడు, చెంగల్రాయయాదవ్‌లు ఎంపీని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కృష్ణమనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైజాగ్ సమ్మిట్‌తో ఆంధ్రకు విరివిగా పెట్టుబడులు



తూగుండ్రంలో పీహెచ్‌సీలో కొత్తబోరును ప్రారంభించి నీటిని పరిశీలిస్తున్న పెనుమూరు ఏఎంసీ చైర్మన్ కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో నిర్వహించిన సమ్మిట్‌తో ఆంధ్రరాష్ట్రానికి విరివిగా పెట్టుబడులు పెట్టేందుకు చాలామంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని, ఇందుకు కూటమి ప్రభుత్వం పనితీరే నిదర్శనమని పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ చొరవతో గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పీహెచ్‌సీలో రూ.5లక్షల ఎంపీపీ, జడ్పీ నిధులతో ఏర్పాటుచేసిన కొత్త బోరును, విద్యుత్ మోటర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా కోలుకోలేని విధంగా దిగజార్చిందని విమర్శించారు. అనంతరం పీహెచ్‌సీ డాకర్లు ప్రవీణ్, మౌనికలతో ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో పెనుమూరు ఏఎంసీ డైరెక్టర్ నియాజ్‌అలీ, పార్లమెంట్ టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి జీవరత్నం, నేతలు నరసింహులు నాయుడు, బాబు నాయుడు, నీరజాక్షులురెడ్డి, శాంతకుమార్, రాఘవేంద్ర, అతేహర్ అలీ, కమల్, పంచాయతీ కార్యదర్శి శిరీష, శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

● రెండు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్



వాహనాలను సీజ్ చేస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది (ఇన్‌సెట్‌లో) అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

పూతలపట్టు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించడంతో రెవెన్యూ సిబ్బంది రెండు ట్రాక్టర్లు, ఓ ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీ టి.కె.పల్లి సమీపాన అడ్డగుట్ట ఉంది. ఈ అడ్డగుట్టను కబ్జాచేసేందుకు భూమిని కొంతమంది చదునుచేయగా, సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసులు అక్కడికి వెళ్లి రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం ఆ భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని రెవెన్యూ అధికారులు సూచిక బోర్డును ఏర్పాటు చేశారు.

అబాకస్ పోటీల్లో పీఈఎస్ పాఠశాల విద్యార్థుల సత్తా



అవార్డు అందుకుంటున్న భార్గవ్

యాదమరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర సిప్ అబాకస్ పోటీల్లో పీఈఎస్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. చెన్నైలో రెండ్రోజులుగా జరిగిన సిప్ అబాకస్ అంతరాష్ట్ర ప్రతిష్టాత్మక పోటీల్లో దేశం నలుమూలల నుండి మొత్తం 5,870 మంది విద్యార్థులు పాల్గొనగా, తమ పాఠశాల విద్యార్థులు పలు స్థానాలను సాధించి విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ కృష్ణబాబు తెలిపారు. విజేతల వివరాలు... రాష్ట్రస్థాయిలో ఎస్.భార్గవ్ విన్నర్‌గా నిలవగా, కె.కార్తీక్‌సాయి, పి.వి.కార్తీక్, జె.కిశోర్, ఎస్.దీక్షిత, ఎన్.వి.విగ్నేష్ చౌదరి, ఎస్.మోహిత్‌లు రన్నర్స్‌గా నిలిచారన్నారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

పచ్చదనం పరిశుభ్రతపై సర్పంచ్‌లకు శిక్షణ

యాదమరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత, పచ్చదనం పరిరక్షణ కోసం గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు చేపట్టవలసిన కార్యాచరణపై మండలస్థాయిలో ఒకరోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణా తరగతులకు డీపీఆర్సీ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్‌రెడ్డి హాజరై సర్పంచ్‌లకు దిశానిర్దేశం చేశారు. పంచాయతీల పరిధిలో తీసుకోవాల్సిన చర్యల గూర్చి ఆయన సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరేంద్ర, డిప్యూటీ ఎంపీడీవో రామచంద్ర, పలు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

22న దివ్యాంగులకు అసెస్‌మెంట్ క్యాంపు

నగరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పరికరాలను అందించడానికి ప్రత్యేక అసెస్‌మెంట్ క్యాంపుని ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన దివ్యాంగులకు నగరి పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్యాంపు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

సింగిల్ విండోని బలోపేతం చేద్దాం



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ ప్రతాప్‌నాయుడు

గుడిపాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుడిపాల సింగిల్ విండోను పాలకవర్గం సమిష్టితో బలోపేతం చేద్దామని చైర్మన్ ప్రతాప్‌నాయుడు అన్నారు. సోమవారం సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణాలు ఇప్పించడంలో సిబ్బంది సహకరించాలన్నారు. బ్యాంకు పథకాలను రైతులకు వివరించి, సద్వినియోగపరచుకునేలా చూడాలన్నారు. బంగారంపై తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నట్లు తెలపాలన్నారు. కార్యక్రమంలో సీఈవో పట్టాభి, డైరెక్టర్లు హరిప్రసాద్, సెల్వినాథన్, టీడీపీ ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంయాదవ్, నాయకులు ఆనంద గౌడ్, రవినాయుడు, సింగిల్ విండో సిబ్బంది సెల్వం, జిత్తు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు

తెలుగు, ఇంగ్లీష్ మీడియం రెండు కళ్లులాంటివి

గంగాధరనెల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు, ఇంగ్లీష్ మీడియంలు రెండు కళ్లలాంటివని ఎంఈవో-2 గుణశేఖర్ రెడ్డి అన్నారు. గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లె మోడల్‌స్కూల్‌లో సోమవారం బాలల దినోత్సవాన్ని హెచ్‌ఎం చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లేపల్లెలో మోడల్‌స్కూల్ ఏర్పాటుకు టీచర్ కోటి చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌టీయూ నేత కమలాపతి నాయుడు, పరంధామ నాయుడు, టీచర్లు స్వర్ణలత, పద్మజ, శివగామి తదితరులు పాల్గొన్నారు.